



అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 234 | సోమవారం 9 జూన్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-

# పార్టీల్లో కోవర్టుల కలకలం



- ఎత్తులకు పైఎత్తులు వేయడం వచ్చుండాలి
- తమ బలాన్ని నమ్ముకోవడం ఒకెత్తయితే.. ఎదుటివారి బలహీనతల్ని పసిగట్టడం
- అవతలివైపు లోగుట్టును ఎప్పటికప్పుడు తెలుసుకోవడం..
- అన్ని రాజకీయ పార్టీలూ ఇప్పుడ రెండో ఎత్తుగడమీదే ఎక్కువ ఆధారపడుతున్నట్టు కనిపిస్తోంది
- గల్లీ నుంచి ఢిల్లీ పాలిటిక్స్ వరకు.. ప్రధాన పార్టీలను కలవరపెడుతున్న అంశం కూడా అదే.


**అంకుశం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్**

రాజకీయాల్లో గెలవాలన్నా.. గెలిచి నిలవాలన్నా? ఎత్తులకు పైఎత్తులు వేయడం వచ్చుండాలి. తమ బలాన్ని నమ్ముకోవడం ఒకెత్తయితే.. ఎదుటివారి బలహీనతల్ని పసిగట్టడం, అవతలివైపు లోగుట్టును ఎప్పటికప్పుడు తెలుసుకోవడం.. మరో బలమైన ఎత్తు. సమకాలీన రాజకీయాల్లో.. అన్ని రాజకీయ పార్టీలూ ఇప్పుడ రెండో ఎత్తుగడమీదే ఎక్కువ ఆధారపడుతున్నట్టు కనిపిస్తోంది. గల్లీ నుంచి ఢిల్లీ పాలిటిక్స్ వరకు.. ప్రధాన పార్టీలను కలవరపెడుతున్న అంశం కూడా అదే. ఇంతకీ, ఆ ముచ్చటేంటి? ఆ కలవరానికి కారణమేంటితెలుగు రాజకీయాల్లో.. ఇప్పుడు ఇలాంటి చర్చే జరుగుతోంది. ఏ పార్టీలో ఎవరి కోవర్టులు ఉన్నారో తెలియని గందరగోళ పరిస్థితులు నెలకొనడమే దీనికి ప్రధానంగా కారణంగా తెలుస్తోంది. చిన్నచితక నాయకులు మాట్లాడేదైతే మరేమంత సీరియస్ ఇష్యూగా పరిగణించాల్సిన అవసరం ఉండేది కాదేమో. రాహుల్ గాంధీ నుంచి.. చంద్రబాబు, కేటీఆర్‌లవరకు? బడానేతలు ఈ విషయాన్ని నొక్కి వక్కాణించడమే ఈ స్థాయి చర్చకు దారితీస్తోంది. చర్చకు సంగతి పక్కనపెడితే.. ప్రాంతీయ పార్టీ నుంచి జాతీయ పార్టీల వరకు? ప్రతిఒక్క పక్షాన్ని కోవర్టుల సమస్య ఇబ్బంది పెడుతోందనేది మాత్రం స్పష్టమవుతోంది. అయితే, ఏ పార్టీలో ఎవరికెవరు కోవర్టులుగా పనిచేస్తున్నారని తెలుసుకోవడమే ఇప్పుడు సవాలుగా మారింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు? పార్టీలో కోవర్టులపై ఇటీవల చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. హత్యా రాజకీయాల్లో తలపండిన వైసీపీ నాయకులు కొందరు కోవర్టుల్ని తెదేపాలోకి పంపి వారి ఎజెండాను నెరవేర్చుకోవాలని అనుకుంటున్నారంటూ బాంబు పేల్చారు. సంతనూతలపాడులో టీడీపీ నేత వీరయ్య చౌదరి, మాచర్లలో మరో ఇద్దరు కార్యకర్తల హత్యలతో.. తనకు అదే అనుమానం కలుగుతోందన్నారు చంద్రబాబు. అలాంటి వారిని ఉపేక్షిస్తే మన వేలితో మన కన్ను పొడుచుకున్నట్టేనంటూ.. కార్యకర్తల్ని హెచ్చరించారు.పదేళ్ల పాటు అధికారం చెలాయించిన బీఆర్ఎస్‌ను కూడా ఇప్పుడు కోవర్టుల భయం వెంటాడుతోంది. ఇటీవల కేసీఆర్‌కు కవిత రాసిన అంతర్గత లేఖ.. బయటకు లీకవడంతోనే కోవర్టుల ముచ్చట తెరమీదకు వచ్చింది. అంతర్గత విషయం బయటకెలా వచ్చిందో తేల్చాలని కవిత డిమాండ్ చేయగా ? పార్టీలో సీఎం రేవంత్రెడ్డి కోవర్టులు ఉన్నారంటూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. టైమొచ్చినప్పుడు ఆ కోవర్టులు వాళ్లంతట వాళ్లే బయటపడ్తారంటూ? ఇండైరెక్టుగా గట్టి వార్నింగే ఇచ్చారు. ఆలోపు ఇంకెన్ని బీఆర్ఎస్ సీక్రెట్స్ బయటకు వస్తాయో తెలియదు.కేటీఆర్ చెప్పిన దాంట్లో వాస్తవం లేకపోలేదు. ప్రతీ పార్టీలోనూ కోవర్టులు ఉంటారు. అక్కడి అంతర్గత విషయాలను.. తమ బాసులకు చేరవేస్తుంటారు. - మిగతా3లో

## వర్తమానాన్ని వదిలేసి.. 2047 గురించి కలలా?



- కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- గత 11 ఏళ్లుగా ఎలాంటి జవాబుదారీతనం లేకుండా కేవలం ప్రచారం మాత్రమే కొనసాగిస్తోంది
- ముంబయి నుంచి వస్తున్న విషాద వార్త దేశంలోని వాస్తవికతను ప్రతిబింబిస్తోంది



## 'మోదీ 3.0'కు 11 ఏళ్లు

- వికసిత్ భారత్ ఎజెండానే తమ లక్ష్యం
- ఈ ఏడాది పాలనలో ఆపరేషన్ సింధూర్ , వక్ఫ్ సంస్కరణలు, ప్రపంచ దేశాల్లో భారత దేశ ఖ్యాతి పెరిగింది
- ఇటీవలే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించింది
- త్వరలోనే మూడో స్థానానికి చేరుతాం
- ప్రధాని మోదీ సంచలన ట్వీట్

# రెండు నెలల్లో సేవలన్నీ వాట్సప్‌లో

- పపంచంలో యువత ఎక్కువగా ఉన్న దేశం ఇండియా
- డీప్ టెక్‌తో టెక్నలజీ బాగా పెరిగిందన్నారు
- వాట్సప్ గవర్నెన్స్‌తో ఆన్‌లైన్ సేవలు అందుతున్నాయి
- రాబోయే రోజుల్లో డేటా నాలెడ్జి, టూల్స్ అన్ని రెడీగా ఉంటాయి
- అన్ని నియోజవర్గాల్లో ఎంఎస్‌ఎంఈల ఏర్పాటు: చంద్రబాబు
- "టెక్నాలజీ అనేది గేమ్ ఛేంజర్.. భవిష్యత్‌లో అదే కీలకం
- భవిష్యత్‌లో యుద్ధాలు కూడా డ్రోన్లతోనే జరుగుతాయి
- ఈ నెలలోనే తల్లికి వందనం అమలు చేస్తాం
- అమరావతి సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు
- విశాఖను ముంబయిలా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేస్తామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సేవారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. సేవారంగం నుంచి మనకు 6.3 శాతం ఆదాయమే వస్తోందని, దానిని విస్తరిస్తే ఆదాయం పెరుగుతుందని తెలిపారు. "టెక్నాలజీ అనేది గేమ్ ఛేంజర్. భవిష్యత్‌లో అదే కీలకం. భవిష్యత్‌లో యుద్ధాలు కూడా డ్రోన్లతోనే జరుగుతాయి. ఈ నెలలోనే తల్లికి వందనం అమలు చేస్తాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు అమలు చేస్తాం. - మిగతా3లో

## 11 ఏళ్ల మోదీ పాలన స్వర్ణయుగం



- ఈ పదకొండేళ్లలో ఆర్థిక పునరుద్ధరణ, సామాజిక న్యాయం, సాంస్కృతిక గౌరవం, జాతీయ భద్రతతో కొత్త శకాన్ని దేశం చూస్తోంది
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

## పోలవరం డి వాల్‌పై ఆ వార్తలు అవాస్తవం



- పోలవరం ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించి పనులు చేస్తుంటే వైకాపా కరపత్రికలో అవాస్తవాలు ప్రచురిస్తున్నారు.
- నాడు నిర్లక్ష్యంతో పోలవరం భవిష్యత్తును ప్రశ్నార్థకం చేశారు.
- ఏపీ నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



# యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు

- సాక్షి టీవీ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావును ఏపీ పోలీసుల అరెస్టు
- హైదరాబాద్ నుంచి ఏపీకి తరలింపు
- కొమ్మినేనిపై గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

## తొక్కిసలాట కేసులో మరో మలుపు..




- కర్ణాటక హైకోర్టుకు ఆర్‌సీబీ
- తమపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లను కొట్టివేయాలని కోరాయి.
- తొక్కిసలాటకు దారితీసిన క్రౌడ్ మేనేజ్మెంట్‌లో తమ పాత్ర ఏమీ లేదని ఆర్‌సీఎస్‌ఎల్ తమ పిటిషన్

## చైనాలో అందగాళ్లకు డిమాండ్

కౌగలించుకుటంటే ఐదు నిమషాలకు రూ. 600

# రెండు నెలల్లో సేవలన్నీ వాట్సప్‌లో

-మొదటిపేజీ తరువాయి

దీపం–2 కింద ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తాం. 21 దేవాలయాల్లో అన్న ప్రసాదం ఏర్పాటు చేశాం. సంక్షేమం, అభివృద్ధిని సమతూకం చేసుకుంటూ ముందుకెళ్తున్నాం. విధ్వంసం నుంచి అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని ప్రజలకు హామీ ఇచ్చాం. పీ–4 కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తాం. అభివృద్ధి అనేది అన్ని ప్రాంతాల్లో సమాంతరంగా జరగాలి. తలసరి ఆదాయంలో విశాఖ ముందుంటే.. శ్రీకాకుళం వెనకబడింది. తలసరి ఆదాయాన్ని ఏటా బెంచ్‌మార్క్ కింద సమీక్ష చేస్తాం. 2027 నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ప్రాజెక్టు సకాలంలో పూర్తి కాకపోవడం వల్ల డయాఫ్రం వాల్ ఖర్చు రెండున్నర రెట్లు పెరిగింది. అమరావతి సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు. విశాఖను ముంబయిలా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం. విశాఖ నగరానికి అనేక పరిశ్రమలు, ఐటీ సంస్థలు వస్తున్నాయి. విశాఖ రైల్వే జోన్ పనులు ప్రారంభం అవుతున్నాయి. పోలవరం–బనకచర్ల అనుసంధానం చేస్తాం. తిరుపతిని కూడా అనేక విధాలుగా అభివృద్ధి చేస్తాం. ప్రాజెక్టులు త్వరగా పూర్తయ్యేలా కూటమి నేతలు ప్రయత్నించాలి. క్షేత్ర స్థాయిలో చూస్తేనే ప్రాజెక్టు పరిస్థితి ఏంటో తెలుస్తుంది" అని చంద్రబాబు అన్నారు.

ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల స్వర్ణాంధ్ర కార్యాలయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రపంచంలో యువత ఎక్కువగా ఉన్న దేశం ఇండియా అని అన్నారు. బ్రాండింగ్ అనేది ఇప్పుడు చాలా ముఖ్యమని తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో స్వచ్ఛాంధ్రను అమలు చేస్తున్నామని తెలిపారు. డీప్ టెక్‌తో టెక్నలజీ బాగా పెరిగిందన్నారు. వాట్సప్ గవర్నెన్స్‌తో ఆన్‌లైన్ సేవలు అందుతున్నాయని తెలిపారు.



రెండు నెలల్లో అన్ని సర్వీస్‌లు వాట్సప్‌లో ఉంటాయని వెల్లడించారు. రాబోయే రోజుల్లో డేటా నాలెడ్జి, టూల్స్ అన్ని రెడీగా ఉంటాయని అన్నారు. టెక్నాలజీ అనేదీ ఫ్యాషన్ కాదు.. గేమ్ ఛేంజర్ అని తెలిపారు. పేదరికం లేని ఏపీని తయారు చేస్తామని.. అందుకే పీ4 కార్యక్రమం తీసుకువచ్చామని అన్నారు. ఆదాయం పెరగాలని ఆరోగ్యం, ఆనందం ఉండాలని ఆకాంక్షించారు. 26 జిల్లాల్లో యాక్షన్ ప్లాన్ విజన్ డాక్యుమెంట్ తయారైనట్లు తెలిపారు. 26 జిల్లాల్లో రోడ్ మ్యాప్ మండలాల వారీగా కూడా యాక్షన్ ప్లాన్ సిద్ధమైనట్లు చెప్పారు. కొన్ని నియోజకవర్గాల్లో పరిస్థితి ఒక్కోలా ఉంటుందన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో వ్యవసాయం తక్కువ, ఉద్యానవన పంటలు ఎక్కువ ఉంటాయన్నారు. మరొకొన్ని జిల్లాల్లో ఆక్వా, డైరీ ఇలా అందుబాటులో ఉన్న వాటిని ఉపయోగించుకోవాలని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతీ నియోజకవర్గంలో అనుకూలమైన సర్వీస్ సెక్టార్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. హాస్పిటల్, టూరిజం ఇలా అన్ని రంగాలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. మరోవైపు జాతీయ రహదారులు, రాష్ట్రంలో రోడ్లపై సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో శరవేగంగా రహదారుల నిర్మాణం జరగాలన్నారు. జూలై నెలాఖరుకు ఆటంకాలు తొలిగించాలని అధికారులకు సూచించారు. ఈ ఏడాది 1,040 కి.మీ జాతీయ రహదారుల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న, త్వరలో నిర్మించ తలపెట్టిన అన్ని రాష్ట్ర, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, అటవీ, వన్యప్రాణి క్లియరెన్స్ సమస్యలు జూలై నెలాఖరుకు పరిష్కరించాలన్నారు. ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా రాష్ట్రంలో రహదారుల నిర్మాణం వేగవంతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. వివిధ రహదారి ప్రాజెక్టుల పురోగతిని ఈ సందర్భంగా సీఎం పరిశీలించారు.

నిర్ణీత కాలవ్యవధికి మించి ఆలస్యమైన ప్రాజెక్టుల కాంట్రాక్ట్ సంస్థలపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై ఏ రహదారి నిర్మాణమూ ఆలస్యం కాకూడదని స్పష్టం చేశారు. ఎన్‌హెచ్‌ఏఐ, ఎంఓఆర్టీహెచ్ కింద రూ.11,325 కోట్లతో 770 కి.మీ రహదారులు గత ఆర్థిక సంవత్సరంలో నిర్మాణం పూర్తి చేసినట్లు ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. రూ.20,067 కోట్ల విలువైన 1,040 కి.మీ. రహదారి పనులు పూర్తి కావాలని సూచించారు. 1,307 కి.మీ పొడవైన అత్యంత రద్దీ కలిగిన 18 రహదారుల డీపీఆర్ రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. మిగిలిన 8,893 కి.మీ.పొడవైన 242 రహదారుల ఫ్రీ విజబిలిటీ అధ్యయనాన్ని రెండు విడతల్లో చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సీఎం సూచనల మేరకు అదనంగా యలమంచిలి – గాజువాక, గాజులమండ్యం – శ్రీసిటీ రహదారుల్ని కూడా పీపీపీ విధానంలో అభివృద్ధి జరుగనుంది.

# నాలుగేళ్ల ముందే అలెర్ట్... బ్యాడ్ నేమ్ తెచ్చుకుంటున్న ఎమ్మెల్యేలపై గురి

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు నాలుగేళ్లకు ముందే అలెర్ట్ అయినట్లు కనిపిస్తుంది. ఎమ్మెల్యేల పనితీరును గమనించకపోతే అసలుకే ఎసరు వస్తుందని ఆయన గట్టిగా నమ్ముతున్నారు. గత ఎన్నికల్లో కూటమి హవాలో 164 స్థానాల్లో సూపర్ డూపర్ విక్టరీ సాధించినప్పటికీ గత ఏడాదిగా కూటమి పార్టీల నేతల మధ్య సయోధ్య లేకపోవడంతో, కిందిస్థాయిలో ఆశావహులు ఎక్కువగా ఉండటంతో పాటు విభేదాలు మరింతగా ముదిరి వీధిన పడుతుండటంతో మూడు పార్టీలకు తలనొప్పిగా తయారయింది. అన్ని చోట్ల ఆధిపత్య పోరు కనిపిస్తుంది. ఇక ఎమ్మెల్యేల పనితీరు కూడా అంత ఆశాజనకంగా లేదని అందుతున్న నివేదికలను బట్టి తెలుస్తోంది ప్రధానంగా ఈసారి ఎన్నికల్లో అత్యధికంగా 88 మంది వరకూ మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు. మొదటి సారి గెలిచిన ఎమ్మెల్యేలతోనే సమస్య తలెత్తుతోంది. సీనియర్ ఎమ్మెల్యేలు ఉన్నచోట్ల ఈ సమస్య పెద్దగా కనిపించడం లేదు. వారిపై పెద్దగా ఆరోపణలు కూడా రావడం లేదు. ఎందుకంటే వారి అనుభవంతో అనేక విషయాలను బయటకు రాకుండానే సహజంగా జాగ్రత్త పడుతున్నారు. కానీ కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేలు మాత్రం నేరుగా రంగంలోకి దిగి బ్యాడ్ నేమ్ ను కొని తెచ్చుకుంటున్నారు. ఇసుక తరలింపు, మద్యం షాపుల వేలంపాటలు, బార్లను కొనసాగించడం, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో తలదూర్చడం వంటి విషయాల్లో కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేల పేర్లు జనం నోళ్లతో నానుతున్నాయి.. ఒకవైపు సంక్షేమ పథకాలు అందలేదని జనంలో అసంతృప్తి ఉన్న నేపథ్యంలో మరొకవైపు అవినీతిని ఎమ్మెల్యేలే దగ్గరుండి ప్రోత్సహిస్తుండటం కూడా ప్రజల్లో పలచనకు కారణమయింది. ఇలాగే ఉపేక్షిస్తే వచ్చే ఎన్నికల్లో దారుణమైన ఫలితాలు చూడాల్సి వస్తుందని చంద్రబాబు తన అనుభవంతో ముందే గుర్తించారు. తాము పరిపాలనలో ఎన్ని సంస్కరణలు, ఎన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నప్పటికీ స్థానికంగా ఉండే ఎమ్మెల్యేలు సక్రమంగా లేకపోతే అసలుకే మోసం వస్తుందని భావించిన చంద్రబాబు నాయుడు నాలుగేళ్ల ముందే అప్రమత్తమయ్యారు. అందుకే ఎమ్మెల్యేలను గాడిలో పెట్టేందుకు తన వంతుగా ఆయన ప్రయత్నాలను ప్రారంభిస్తున్నట్లు కనపడుతుంది. ఇందులో భాగంగానే చంద్రబాబు నాయుడు మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు మరింత బాధ్యతగా పనిచేయాలని గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. ప్రజలకు , కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండాలి.. వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదనేది తన ఆలోచన అని నేరుగా చెప్పేశారు. ప్రజలు అన్నీ గమనిస్తారని, జాగ్రత్తగా ఉండాలని, లేకుంటే ఇబ్బందులు పడతారని చంద్రబాబు గట్టిగానే హెచ్చరించినట్లు తెలిసింది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై సర్వేలు,



నివేదికలు తెప్పించుకునేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారు. అంతేకాదు తాను మంచి చేస్తే అభినందిస్తానని, తప్పు చేస్తే దూరం పెడతానని కూడా చెప్పారు. త్వరలోనే ఒక్కో ఎమ్మెల్యేతో ముఖాముఖి భేటీలు నిర్వహించేందుకు కూడా చంద్రబాబు సిద్ధమవుతుండటం చూస్తుంటే కూటమికి డేంజర్ బెల్స్ మోగుతున్నాయని చంద్రబాబుకు కూడా అర్థమయినట్లే కనిపిస్తుంది.

తలనొప్పిగా మారిన సవిత

మొదటి సారి ఎమ్మెల్యే అయ్యారు. అదృష్టం బాగుండి చంద్రబాబు కేబినెట్ లో మంత్రి అయి కూర్చున్నారు. దీంతో మంత్రి సవితకు ఏమీ అర్థం కావడం లేదు. కనీసం అధికారులను గౌరవించడం కూడా తెలయకుండా మంత్రులు దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఫస్ట్ టైమ్ గా ఎన్నికై అదేదో తమ వల్లనే గెలిచామన్న భావనలో విర్రవీగుతుండటంతోనే ఈ సమస్య తలెత్తుతుంది. మంత్రులలో కొందరు అందులోనూ తొలిసారి మంత్రి అయిన వారు చంద్రబాబు నాయుడుతో పాటు పార్టీకి కూడా తలనొప్పులుగా మారుతున్నారు. గతంలో కడప జిల్లాకు చెందిన మంత్రి మడింపల్లి రాంప్రసాద్ రెడ్డి సతీమణి పోలీసు అధికారిపైనే జులుం ప్రదర్శించారు. దీంతో చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. ఆ దెబ్బకు మడింపల్లి రాంప్రసాద్ రెడ్డితో పాటు ఆయన సతీమణి కూడా క్షమాపణ చెప్పాల్సిన పరిస్థితి వచ్చింది. మంత్రులు అప్పనంగా వచ్చిన పదవులను అనుభవించడంలో తమ దర్పాన్ని ప్రదర్శించడానికే ఇలా చేస్తున్నారా? లేక అతి విశ్వాసంతో ఈ పనులు చేస్తున్నారా? అన్నది తేలకుండా ఉంది. అయితే వీరి వ్యవహార శైలి మాత్రం మొత్తం కూటమి ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది. ఎవరిని కట్టడి చేయలేని పరిస్థితి. తమకు అప్పగించిన శాఖల్లో పట్టు పెంచుకుని, ప్రజలకు సేవలందించాల్సిన అమాత్యులు అనవసర వివాదాల్లో కూరుకుని కూటమిని ఇబ్బందులు పాలు చేస్తున్నారు. ఎన్ని సార్లు చెప్పినా వీరి పరిస్థితుల్లో మార్పు కనిపించడం లేదు. తాజాగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత కూడా చంద్రబాబు సర్కార్ కు తలనొప్పులు తెచ్చేలా వ్యవహరించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. పెనుకొండ టిక్కెట్ తెచ్చుకోవడమే అదృష్టం. ఆపైన ఎమ్మెల్యే కావడం మరొక లక్కు. అదీ చాలక ఏకంగా మంత్రి పదవి వరించింది. అణిగి మణిగి ఉండాల్సిన మంత్రి సవిత మాత్రం రెచ్చిపోతున్నారు. అదీ అధికారులపైన మంత్రి సవిత దురుసు ప్రవర్తన సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. పెనుకొండ తహశీల్దార్ శ్రీధర్ ఇచ్చిన బోకేను మంత్రి సవిత విసిరేసిన వీడియో వైరల్ గా మారింది. సత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్ సమక్షంలో ఘటన జరిగింది. ఈ నెల ఒకటో తేదీన రేషన్ బియ్యం పంపిణీ సందర్భంగా ఈ ఘటన జరగడంతో మంత్రి సవిత తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## పంటి కింద నలుసుగా వర్మ..

**కాకినాడ :** పిఠాపురం నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేనల మధ్య విభేదాలు రోజురోజుకు ముదురుతున్నాయి. అక్కడ టీడీపీ నేతలకు, జనసేన నేతలకు మధ్య పొసగడం లేదు. పవన్ కల్యాణ్ మాజీ ఎమ్మెల్యే వర్మ కు ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ అక్కడ ఉన్న జనసేన ఇన్ ఛార్జులతో పాటు కార్యకర్తలు టీడీపీ నేతలు లెక్క చేయడం లేదు. కనీసం ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా ఆహ్వానాలు ఉండటం లేదు. దీంతో జనసేన నేతల పర్యటనల్లో టీడీపీ నేతలు జై వర్మ.. జై జై టీడీపీ అన్న నినాదాలు పెద్దయెత్తున వినిపిస్తున్నాయి. నాగబాబు పర్యటించినప్పుడు కూడా ఇవే నినాదాలు వినిపించాయి. అయితే జనసేన లోకల్ లీడర్స్ మాత్రం పట్టించుకోవడం లేదు. మరొకవైపు మాజీ ఎమ్మెల్యే వర్మ కూడా ఇక లాభం లేదనుకున్నాడో ఏమో రివర్స్ అటాక్ కు రెడీ అయినట్లు కనపడుతుంది. ఇటు కూటమి ధర్మానికి తూట్లు పడకుండానే, జనసేన నేతలను ఇరుకునపడేలా ఆయన చేస్తున్న కామెంట్స్ వైరల్ గా మారుతున్నాయి. పిఠాపురం నియోజకవర్గంలో ఇసుక దోపిడీ కొనసాగుతుందని తెలిపారు. ఇసుక మాఫియా పిఠాపురం నియోజకవర్గంలో రాజ్యమేలుతుందని, రాత్రి వేళ రెండు వందల లారీల ఇసుకను తరలిస్తున్నారని కూడా వర్మ వ్యాఖ్యానించడం విశేషం. పోలీసులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, పోలీసులకు కూడా భారీగానే ముడుపులు ముడుతున్నట్లు అనిపిస్తుందని వర్మ అనడం మరింత ఇబ్బంది పెట్టేలా ఉంది ఉప ముఖ్యమంత్రిగా అందరికీ ఆదర్శంగా ఉందామనుకుంటున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని మిత్ర పక్షానికి చెందిన నాయకుడు విమర్శలు చేస్తుంటే పవన్ పరువు పోవడమే కాకుండా, పిఠాపురంలో ఏదో జరుగుతుందని అందరికీ అర్థమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల జరిగిన మహానాడు కార్యక్రమంలో కూడా వర్మకు టీడీపీ నాయకత్వం ప్రాధాన్యత ఇవ్వడం కనిపించింది. దీంతో మహానాడు తర్వాత ఈ వ్యాఖ్యలు చేయడం చూస్తుంటే పవన్ కల్యాణ్ పేరు ప్రస్తావించకపోయినా, ఆయన ఇమేజ్ ను డ్యామేజీ చేయాలన్న భావన వర్మలో ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తుందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వర్మ మామూలుగా చేసిన వ్యాఖ్యలుగా దీనిని చూడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే వర్మ సీనియర్ నేత. ఆయన ఏం మాట్లాడితే దాని పర్యవసానాలు ఎలా ఉంటాయో అందరికీ తెలుస్తుంది. కానీ గతంలో నాగబాబు జనసేన

## పోలవరం డి వాల్‌పై ఆ వార్తలు అవాస్తవం

రాజమహేంద్రవరం: పోలవరం ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించి పనులు చేస్తుంటే వైకాపా కరపత్రికలో అబద్ధాలు ప్రచురిస్తున్నారంటూ ఏపీ నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. నాడు నిర్లక్ష్యంతో పోలవరం భవిష్యత్తును ప్రశ్నార్థకం చేశారని విమర్శించారు. రాజమహేంద్రవరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పోలవరంలో జరుగుతున్న పనుల్లో పురోగతిని వివరించారు. ఇప్పటికే అంతర్జాతీయ నిపుణులు 4 సార్లు పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించారని చెప్పారు.

"పోలవరం డయాఫ్రం వాల్ (డి వాల్) మందం తగ్గించి నిర్మిస్తున్నారంటూ సాక్షిలో రాసిన రాతలు అవాస్తవం. 100 మీటర్ల లోతులో నిర్మించేటప్పుడు కొద్దిగా వ్యత్యాసం ఉంటుంది. ఇది డిజైన్‌లో కూడా అనుమతి ఇచ్చిందే. ఏ ప్యానల్ అయినా 1.5 మీటర్ల మందంతోనే ఉంటుంది. డిజైన్‌కు విరుద్ధంగా ఉందంటూ ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఉష్ణోగ్రత విషయంలోనూ ఐఐటీ తిరుపతి సూచనలను పాటిస్తున్నాం. 2022, 2023లో మేఘాకు ఇచ్చిన ధరల ప్రకారమే పనులు చేయడానికి అనుమతి ఇచ్చాం. గతంలో జగన్ చేసిన తప్పిదం మేం చేయకూడదనే, పనుల్లో జాప్యం జరగకూడదనే మేఘాకే డి వాల్ పనులు అప్పగించాం. పూర్తకాదనుకున్న ప్రాజెక్టు పూర్తవుతుందనే వైకాపా నేతలు అక్కసు వెళ్లగక్కుతున్నారు" అని మంత్రి నిమ్మల ధ్వజమెత్తారు.

## యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు

**హైదరాబాద్:** సాక్షి టీవీ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావును ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. అమరావతి మహిళలను కించపరిచిన కేసులో ఆయన్ను అరెస్టు చేశారు. హైదరాబాద్ జర్నలిస్టు కాలనీలోని ఆయన ఇంటికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి ఏపీకి తీసుకువెళ్తున్నారు. కొమ్మినేనిపై గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సాక్షి టీవీ ఛానెల్‌లో చర్చ సందర్భంగా అసభ్య వ్యాఖ్యల అంశంలో రాజధాని రైతులు, మహిళలు, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కంభంపాటి శిరీష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అమరావతిలో ఉన్న తాడికొండ ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గంలోని దళిత మహిళలను అవమానించారన్న ఫిర్యాదుతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ఇతర సెక్షన్ల కింద కేసు నమోదైనట్లు తెలుస్తోంది. కొమ్మినేనితోపాటు జర్నలిస్ట్ కృష్ణంరాజు, సాక్షి యాజమాన్యంపైనా కేసు నమోదు చేశారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో విజయవాడ అయోధ్యనగర్ కాలనీలోని ఇంటికి తాళం వేసి కృష్ణం రాజు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన్ను పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు.

## టీడీపీలో కోవర్టుల కలకలం

-మొదటిపేజీ తరువాయి

మంది చేరుతున్నారని అనుమానిస్తున్నారు. చంద్రబాబు నేరుగా హెచ్చరించినా కోవర్టుల చేరికలు ఆగకపోవడంతో అధికారికంగా సమాచారం పంపినట్లుగా చెబుతున్నారు. ఇక ముందు నుంచి ఎవరూ టీడీపీలో చేరాలన్నా పార్టీ హైకమాండ్ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఆ ఎన్నికల్లో అవకాశాల కోసం చాలా మంది ఇతర పార్టీల నేతలు టీడీపీలోకి వస్తున్నారు. మాచర్లలో జరిగిన టీడీపీ నేతల జంట హత్యల వెనుక ఇలా అవకాశాల కోసం వచ్చిన వారే ఉన్నారని.. వారు తమ అవకాశాలను మెరుగుపర్చుకోవడానికి టీడీపీలో ఉన్న వారిని హత్య చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. వారు అంతకు ముందు వైసీపీలో ఉండేవారు. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం.. చేరికలు ఆపేయడమేనని నర్ణయానికి వచ్చారు.

### ఒకటి, రెండు సార్లు ఆలోచించుకోవాలి

టిడిపిలో చేరాలనుకునే వారికి షరతులు వర్తిస్తాయి అంటోంది ఆ పార్టీ హై కమాండ్. చేరికల విషయంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.' టిడిపి అధినేత చంద్రబాబు ఆదేశానుసారం ఇతర పార్టీ నాయకులను టిడిపిలోకి జాయిన్ చేసుకునే ముందు తప్పనిసరిగా వారి గురించి కేంద్ర కార్యాలయానికి తెలియజేయాలి. వారి గురించి పూర్తిగా కేంద్ర కార్యాలయం విచారణ చేసిన తర్వాత పార్టీ అనుమతితో వారిని ఆహ్వానించాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీలో వివిధ హోదాల్లో ఉన్నటువంటి నాయకులు అందరూ గమనించగలరు' అంటూ మంగళగిరి కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల తెలుగుదేశం పార్టీలో జరిగిన పరిణామాల దృష్ట్యా హై కమాండ్ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోందిగత మాదిరిగా పార్టీలో చేరాలనుకునే వారికి చేర్చుకుంటామంటే కుదరదు. కచ్చితంగా కేంద్ర కార్యాలయానికి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అక్కడ నుంచి అనుమతి వచ్చిన తర్వాతే టిడిపిలో చేరికలు ఉంటాయని స్పష్టత ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పెద్ద ఎత్తున టిడిపిలో చేరారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నేతలు అధికార పార్టీలోకి వచ్చారు. అయితే వీరిలో కొందరు కోవర్టులు ఉన్నారని సీఎం చంద్రబాబు స్వయంగా కడప మహానాడు వేదికగా కామెంట్ చేశారు. పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు ఇస్తామన్నారు. కొవ్వొత్తులను పార్టీలోకి పంపాలనుకుంటే ఆటలు సాగవని.. వలస పక్షులు వస్తాయి.. పోతాయి అంటూ కామెంట్స్ చేశారు. కొవ్వొత్తుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన వారితో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. మొదటినుంచి జండా మోసిన వారిని కాదని కొత్తగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యమిస్తున్నారని హై కమాండ్ కు ఫిర్యాదులు వెల్లువెత్తుతాయి. ఈ పరిస్థితుల్లోనే హై కమాండ్ ఈ ప్రత్యేక ప్రకటన చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు పవన్ కళ్యాణ్ సైతం తమ పార్టీ శ్రేణులకు మరోసారి అల్టిమేటం ఇచ్చారు. పార్టీ లైన్ దాటి మాట్లాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు పార్టీలు ఏకకాలంలో ఈ ప్రకటన చేయడంపై భిన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. నిఘా వర్గాల హెచ్చరికతోనే ఈ రెండు పార్టీలు అలాంటి ప్రకటన చేసి ఉంటాయని అనుమానాలు వస్తున్నాయి.

## ఆ సేవలు బంద్...

**విజయవాడ :** ఏపీ సచివాలయాల్లో సేవలు బంద్.. కారణం అదే!

ఏపీ ప్రభుత్వం ప్రజలకు కీలక సమాచారం ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆన్లైన్ సేవలు తాత్కాలికంగా నిలిపివేయడం హాట్ టాపిక్ గా మారింది. జూన్ 10 మంగళవారం రాత్రి వరకు సేవలను నిలిపివేయనున్నట్లు ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ శివప్రసాద్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. అయితే సాంకేతిక అంశాలతోనే ఈ సేవలకు అంతరాయం కలుగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటికే దీనిపై పెద్ద ఎత్తున సచివాలయ ఉద్యోగులు ప్రచారం చేస్తున్నారు. సేవలు నిలిచిపోతాయని ముందుగానే ప్రజలకు సూచించారు. అయితే ఇది ఒక హాట్ టాపిక్ అవుతోంది. ప్రస్తుతం రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ సాగుతోంది. ఇంకోవైపు విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులకు ధృవపత్రాలు అవసరం అవుతాయి. ఇటువంటి సమయంలో ఆన్లైన్ సేవలు నిలిపివేయడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ఏపీ సేవా పోర్టల్ ను మైక్రోసాఫ్ట్ క్లౌడ్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ డేటా సెంటర్కు మైగ్రేట్ అవుతోంది. ఈ డేటా మార్పిడి ప్రక్రియ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో కొన్ని ముఖ్యమైన ఆన్లైన్ సేవలు అందుబాటులో ఉండకపోవచ్చు అని అధికారులు ముందుగానే వెల్లడించారు. ముఖ్యంగా తాత్కాలికంగా నిలిచే ముఖ్యమైన సేవలపై స్పష్టతనిచ్చారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం, సమగ్ర ధ్రువీకరణ పత్రం, భూమి మ్యూటేషన్లు, ఇళ్ల స్థలాల దరఖాస్తులు, వృద్ధాప్య ధ్రువీకరణ పత్రం, వివాహ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు సంబంధిత సేవలు, రెవెన్యూ సేవలు, వాటర్ ట్యాక్స్, ప్రాపర్టీ టాక్స్ పేమెంట్లు, పట్టణ పరిపాలన శాఖ సేవలు, మత్స్య శాఖ సేవలు నిలిపి వేస్తున్నట్లు చెప్పింది. అయితే ఈ ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయాలకు వెళ్తున్న వారికి నిరాశ ఎదురవుతోంది.అయితే ఇది తప్పకుండా చేయాల్సిన మార్పు అని? మంగళవారం రాత్రి నుంచి యధాతథంగా సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. ఈ ఆన్లైన్ మార్పుల ప్రభావం అన్ని ప్రభుత్వ సేవలపై ఉండదని కూడా అధికారులు చెబుతున్నారు. ఆధార్ అప్డేట్స్ బ్యాంకు సేవలు, పలు కేంద్ర ప్రభుత్వం స్కీములు, నాన్ రెవెన్యూ ఆధారిత సేవలు వంటి కొన్ని సేవలు మీ సేవ కేంద్రాల్లో యధావిధిగా అందుబాటులోకి ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అత్యవసర పనుల కోసం ముందుగానే అవసరమైన ధ్రువీకరణ పత్రాలు లేదా అప్లికేషన్లు చేసుకోవాలని సూచిస్తున్నారు. అంతరాయం ముగిసిన వెంటనే సేవలు మళ్లీ పూర్వస్థితికి తీసుకొస్తామని చెప్పుకొస్తున్నారు. మొత్తానికి అయితే సచివాలయాల సేవలకు అంతరాయం కలుగుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

# ఏడాదిలో 188 మందిపై అత్యాచారాలు, 15 హత్యలు

- పోలీసుల నిర్లక్ష్యంతోనే అనంతలో ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్య
- అనంతపురం జిల్లాలో ఏకంగా 72 మహిళల మిస్సింగ్ కేసులు
- అర్ధరాత్రి వరకు పంచాయతీలకు నిలయంగా స్టేషన్లు
- పోలీసులకు బాస్‌లుగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యేలు, కీలక నేతలు
- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



**అంకుశం న్యూస్అనంతపురం, జూన్ 9 :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి పోలీస్ వ్యవస్థ నిర్వీర్యం అయ్యిందని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శాంతిభద్రతలు క్షీణించడంతో నిత్యం ఏదో ఒక చోట మహిళలు, బాలికలు, యువతులపై అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఏడాది వ్యవధిలో ఏకంగా 188 మందిపై అత్యారాచాలు జరిగాయని, 15 మందిపై అత్యాచారాలు చేసి హత్యలు చేశారన్నారు. పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే అనంతపురం నగరానికి చెందిన ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్య జరిగిందని చెప్పారు. సోమవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీహార్‌లోని చంబల్ లోయ కంటే దారుణంగా ఏపీలో పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలంలో కుటుంబ సభ్యుల సమక్షంలో గ్యాంప్ రేప్ జరిగిందని గుర్తు చేశార. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి గాలింపు చర్యలు చేపట్టి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని తెలిపారు. ఒక్క అనంతపురం జిల్లాలోనే ఏకంగా 72 మహిళల మిస్సింగ్ కేసులు ఉన్నాయన్నారు. చాలా కేసుల్లో ఫిర్యాదులు తీసుకుని రిజిస్టర్ చేయడానికి కూడా పోలీసులు వెనుకంజ వేస్తున్నారని తెలిపారు.

**గాడితప్పిన లా అండ్ ఆర్డర్**

అనంతపురం జిల్లాలో లా అండ్ ఆర్డర్ గాడితప్పిందని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. జిల్లాలో ఎస్పీ, డీఎస్పీలు చెబితే కింది స్థాయి పోలీసులు వినే పరిస్థితులు లేవన్నారు.. రామగిరి మండలంలో జరిగిన ఘటనలో నిందితులు అధికార పార్టీకి చెందిన వాళ్లేనని తెలిసినా పోలీసులు సరిగా స్పందించలేదన్నారు.

**దిశ యాప్, దిశ పోలీస్‌స్టేషన్లు నిర్వీర్యం**

ఎస్పీ వద్దకు వెళ్లినా, పోలీస్ స్టేషన్లకు వెళ్లినా తమకు న్యాయం జరగదనే భావనలోకి ప్రజలు వెళ్తున్నారని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో దిశ యాప్, దిశ పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తే వాటిని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. దీని వల్ల మహిళలు, బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి భయం లేకుండాపోయిందని తెలిపార. కోర్టు అనుమతి తీసుకుని రిజిస్టర్ చేస్తాం అంటూ పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు.

**సిగ్గుపడే పరిస్థితులు మీరే తెచ్చుకోవద్దు**

మేం పోలీస్ డిపార్ట్‌మెంట్ అని చెప్పుకునేందుకు సిగ్గుపడే పరిస్థితులను మీరే తెచ్చుకోవద్దని అనంత వెంకటరామిరెడ్డి పోలీసులకు సూచించారు. ఐఏఎస్, ఐపీఎస్‌లు దిగజారొద్దని హితవు పలికారు. డ్యూటీ ఇక్కడ కాకుంటే ఎక్కడైనా చేయొచ్చని తెలిపారు. కానీ చట్టప్రకారం వ్యవహరించాలని సూచించారు. మహిళల ప్రాణానికి, మానానికి భద్రత కల్పించలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. స్టేషన్లకు కొన్ని కేసులు వెళ్తే ఎమ్మెల్యేలు, వారి అనుచరుల వద్దకు వెళ్లాలని పోలీసులే చెబుతున్నారని తెలిపారు. కానీ మీరు శాశ్వతం. ముందుగా పోలీస్ మాన్యువల్స్‌ను చదువకోండి. అంబేద్కర్ రాజ్యాంగానికి అనుగుణంగా వెళ్లండి. అలా కాదని రెడ్‌బుక్ రాజ్యాంగం పాటిస్తే పరిస్థితులు దారుణంగా మారుతాయి" అని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు.

**అనంతలో దిగజారుతున్న పరిస్థితి**

అనంతపురం నగరం అంటే ప్రశాంతతకు మారుపేరని, కానీ ఇప్పుడు పరిస్థితులు దిగజారుతున్నాయని అనంత తెలిపారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధి, మరో నాయకుడు ఇద్దరూ నేరచరితులేనని.. ఎవరికి వారు కింగ్‌లుగా మారాలనుకుని ఫిర్యాదులు చేసుకుంటున్నారన్నారు. అలాంటి వారిపై కూడా చర్యలు తీసుకోని దుస్థితిలో పోలీస్ డిపార్ట్‌మెంట్ ఉందన్నారు. ఇటీవల అనంతపురం రూరల్ పరిధిలో వైశ్య కమ్యూనిటీ వారికి చెందిన భూమిని కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నించారని, చివరకు బాధితులు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి భరత్ దృష్టికి తీసుకెళ్లిన పరిస్థితి ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు పోలీస్‌స్టేషన్ లోపలికి వెళ్లి ధర్నాలు చేసినా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. నగరంలో మాట్కా విచ్చలవిడిగా సాగుతోందన్నారు. లాడ్జిలు పేకాట క్లబ్బులుగా మారిపోయాయన్నారు. ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి పేకాట ఆడేందుకే వస్తున్నారన్నారు. ఎప్పుడైనా మీడియా కథనాలు వస్తే అప్పటికప్పుడు పోలీసులు హడావుడి చేయడం మినహా వాటి కట్టడికి తీసుకుంటున్న చర్యలు శూన్యమన్నారు. ఇక మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని, తెల్లవారుజాము నుంచే షాపులు తెరుస్తున్నారన్నారు. ఇంటర్ చదివే విద్యార్థులు సైతం మద్యం షాపుల వద్ద గదుల్లో కూర్చుని మద్యం సేవిస్తున్నా పట్టించుకునే నాథులు లేరన్నారు. నెల నెలా మామూళ్లు వస్తుండడంతో ఎక్సైజ్, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రజాప్రతినిధుల సహకారంతోనే ఇదంతా జరుగుతోందని, ప్రతి నెలా రూ.70 వేల వరకు ప్రతి షాప్ నుంచి ముడుపులు వెళ్తున్నాయని ఆరోపించారు.



## ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం...

**యోగాంధ్రను విజయవంతం చేయాలి...**

**జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్**

**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి , జూన్ 9:** ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదని ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై శ్రద్ధ పెట్టాలని యోగాంధ్రను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్ చేతన్ పిలుపునిచ్చారు. 2047 సంవత్సరం నాటికి ఆరోగ్యకరమైన ,సంపన్నమైన సంతోషకరమైన, ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ ను తీర్చిదిద్దడమే రాష్ట్రప్రభుత్వప్రధానలక్ష్యమని జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ తెలిపారు. అలాగే జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.11 వ అంతర్జాతీయయోగాదినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయంయోగాంధ్రఅవగాహన మహా ర్యాలీ ని జిల్లా కలెక్టర్ టి.ఎస్ .చేతన్ , జిల్లా ఎస్పీ శ్రీమతి వి.రత్నసంయుక్తంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మరియురాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గత మే నెల21 నుండి జూన్ 21 న రానున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు జిల్లాలోని పుట్టపర్తి,లేపాక్షి,కదిరి ,ధర్మవరం ప్రాంతాలలో పర్యాటక యోగమాసోత్సవాలకార్యక్రమాలుజరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిష్ణాతులైన యోగా శిక్షకుల ఆధ్వర్యంలో యోగాసనాలు ప్రతిరోజు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల నుండి కూడా భారీ స్పందన లభిస్తోందని కలెక్టర్ తెలిపారు. సమాజంలోనిప్రతి ఒక్కరు ఇదే స్ఫూర్తితో రానున్న ప్రపంచ యోగా దినోత్సవం లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రమైన పుట్టపర్తి తో పాటు కదిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, లేపాక్షి లోని వీరభద్ర స్వామి, నంది విగ్రహం పర్యాటక ప్రాంతంవద్ద కూడా కార్యక్రమాలు జరిగాయని కలెక్టర్ తెలిపారు. యోగా వల ,మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందన్నారు. ప్రతి కుటుంబంలోనిప్రతి మనిషి కనీసం ఒక గంట సమయాన్ని యోగా కోసం కేటాయిస్తే ఎలాంటి అనారోగ్యాలకు గురికాకుండా ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. యోగాను జీవితంలో ఒక భాగంగా అలవర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. జూన్ 13న ధర్మవరంలో బ్యాంకర్లు, ఉద్యోగులు తదితరులు పెద్ద ఎత్తున యోగా కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా మండల స్థాయి నుంచి సచివాలయ స్థాయి వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగిందని స్వచ్ఛందంగా ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ఉద్యోగులు ప్రజాప్రతినిధులు కూడా కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా భాగస్వాములు అవుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. విశాఖపట్నంలో జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రధాని మోదీపాల్గొనడం జరుగుతుందని అదే రోజున జిల్లాలో కూడా పెద్ద ఎత్తున యోగా దినోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంతకుముందు జిల్లా ఎస్పీ శ్రీమతి వి. రత్న మాట్లాడుతూ యోగాంధ్ర మాసోత్సవాల భాగంగా జరిగే కార్యక్రమాలలో ప్రతిఒక్కరూపాల్గొనివిజయంతో చేయాలని కోరారు. ప్రతిరోజు యోగా చేయడం ద్వారాసంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు యోగాను అలవాటు చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనిసూచించారు.

ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణ, డీఎస్పీ విజయకుమార్ ,డి ఆర్ డి ఎ పి డి నరసయ్య,మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, జిల్లా ప్రభుత్వ శాఖల అధికారులు, విజ్ఞాన్ నర్సింగ్ అకాడమీ విద్యార్థులు, మెప్మా, పర్యాటక శాఖ, పలువురు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. పుట్టపర్తి హనుమాన్ దేవాలయం నుండి బయలుదేరిన యోగా మహా ర్యాలీ జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగింది. అలాగే ఆర్కే బీచ్ చిత్రావతి రహదారిలోయోగా ప్రాధాన్యత పై వ్యాసరచనల పోటీలు నిర్వహించారు.




## సింహ వాహనంపై యోగ నారాయణ స్వామి అలంకారంలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుడు

**అంకుశం న్యూస్ తిరుపతి జూన్ 9:** అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం యోగ నారాయణ స్వామి అలంకారంలో స్వామివారు సింహ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. ఉదయం 8 గంటలకు వాహనసేవ ప్రారంభమైంది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.సాయంత్రం 5 గం.లకు ఊంజల్ మండపంలోకి శ్రీవారు వేంచేపు చేస్తారు. అనంతరం సా. 5.30 - 6.30 గం.ల వరకు ఊంజల్ సేవ జరుగనుంది. రాత్రి 7 గం.లకు ముత్యపు పందిరి వాహనంపై స్వామి వారు భక్తులను ఆశీర్వదించనున్నారు. వాహన సేవలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీమతి శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, అర్చకులు, శ్రీవారి సేవకులు,భక్తులు పాల్గొన్నారు.





## చంద్రబాబు స్ఫూర్తితో రాప్తాడును అన్ని రంగాల్లో అభివృద్ధి

- విజన్-2047 యాక్షన్ ప్లాన్ తో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు
- సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఎమ్మెల్యే పరిటాల సునీత
- రాప్తాడు మండల కేంద్రంలో యోగాంధ్ర ర్యాలీ
- యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలన్న సునీత






**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 9:** ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని నియోజకవర్గాల్లో చేపట్టిన 2047-విజన్ యాక్షన్ ప్లాన్ రాష్ట్ర భవిష్యత్తును మార్చనుందని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణాంధ్ర కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే పరిటాల సునీత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన సందేశాన్ని ఆమె అధికారులతో విన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ముఖ్యంత్రి చంద్రబాబు ఎంతో దూర %ఖు%దృష్టితో ఆలోచిస్తున్నారని.. రానున్న నాలుగేళ్లలో అభివృద్ధి ఎలా ఉంటుందో చూస్తారన్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్క్ లు ఏర్పాటు చేస్తున్నారని.. అందులో భాగంగా దాదులూరులో ఇప్పటికే ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభించామన్నారు. రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు చెప్పారు. వైసీపీ నాయకుల హయాంలో జాకీ పరిశ్రమను కమీషన్ల కోసం వెళ్లగొట్టారని.. ఈ స్థానంలో గార్మెంట్స్ పరిశ్రమను తీసుకురావాల్సి ఉందన్నారు. అలాగే పేరూరు జలాశయానికి నీరు తీసుకొస్తే.. వ్యవసాయం వృద్ధి సాధించడంతో పాటు పరిశ్రమలు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. రాప్తాడు నియోజకవర్గం ఎక్కువ భాగం బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉందని.. రియల్ ఎస్టేట్, వ్యవసాయ రంగాలతోపాటు సోలార్ మరియు ఇతర పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. పీ4 కార్యక్రమం ద్వారా పేదరిక నిర్మూలనకు చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఆయన స్ఫూర్తితో రానున్న నాలుగేళ్లలో అనేక కార్యక్రమాలు చేపడుతామని ఎమ్మెల్యే సునీత అన్నారు.


**యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి.. ఎమ్మెల్యే సునీత పిలుపు**

యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని.. యోగా ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా రాప్తాడులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నగరంలో ఎంపీడీఓ కార్యాలయం నుంచి రాప్తాడు మండల కేంద్రంలోని ప్రధాన వీధుల మీదుగా ఈ ర్యాలీ సాగింది. ఈకార్యక్రమంలో అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు నెల రోజులపాటు యోగాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇటీవల చాలా మంది సరైన వ్యాయమం లేక అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. కనీసం రోజులో అరగంట పాటు యోగా చేయడం వలన ఎంతో మానసిక ఉల్లాసం, ఆరోగ్యం ఉంటుందన్నారు. యోగా అన్నది కేవలం పట్టణాల్లో వినిపిస్తుంటుందని.. కానీ గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించి యోగాతో ఆరోగ్యాన్ని కాపాడుకునేలా చేసేలే ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాలు చేయాలని ఆదేశించారన్నారు. విద్యార్థుల దగ్గర నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికి యోగా దైనందిన కార్యక్రమం కావాలని ఎమ్మెల్యే సునీత అన్నారు...

## సైనిక కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

**సైనిక సంక్షేమ శాఖ అధికారి పి తిమ్మప్ప**

**సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాయలసీమ జిల్లాల స్పర్శ్ కామన్ సర్వీస్ సెంటర్స్ ఏర్పాటుపై శిక్షణ కార్యక్రమం ప్రారంభం**




**అంకుశం న్యూస్ అనంతపురము, జూన్ 9 :** అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గలమాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల పెన్షన్ సమస్యల పరిష్కారాన్ని సులభతరం చేసేందుకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సైనిక్ సంక్షేమ డైరెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాయలసీమ జిల్లాల జోనల్ స్థాయి స్పర్శ్ కామన్ సెంటర్స్ ఏర్పాటు పై నిర్వహిస్తున్న 4 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నాడు ఆర్ డీ టీ ఏ ఎఫ్ ఎకాలజీ సెంటర్లో ఉమ్మడి జిల్లాల సైనిక సంక్షేమ అధికారి పి. తిమ్మప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయవాడ నుండి రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వి. వెంకట్ రెడ్డి వర్చ్యువల్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ మాజీ సైనికులు, సైనిక వితంతువులు, అమర జవాన్ ల కుటుంబ సభ్యుల పెన్షన్ సమస్యలు, పేర్ల సవరణలు తదితర అంశాల సత్వర పరిష్కారం కోసం కేంద్రీయ సైనిక్ బోర్డు ఏర్పాటు చేసిన స్పర్శ్ వెబ్ అప్ నిర్వహణపై రాష్ట్రంలో ప్రతి జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి కార్యాలయాల్లో కేంద్రీయ సైనిక్ బోర్డు, రాష్ట్ర సైనిక్ బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న కామన్ సర్వీస్ సెంటర్స్ నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని దశల వారిగా నిర్వహిస్తున్నామని, ఈ కార్యకరామాన్ని రాయల సీమ జిల్లాల జోన్ నుండి మొదలుపెట్టి , ట్రైనింగ్ నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అనంతపురము జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి. తిమ్మప్ప ను డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకట్ రెడ్డి అభినందించారు. స్పర్శ్ కామన్ సర్వీస్ సెంటర్స్ నిర్వహణకోసం రాయలసీమ జిల్లాలలో ఒక్కో జిల్లా నుండి ఇద్దరు చొప్పున మాజీ సైనికులను ఎంపిక చేసి 4 రోజుల పాటు రెసిడెన్షియల్ ట్రైనింగ్ ను ఆర్ డీ టీ ఏఎఫ్ ఎకాలజీ సెంటర్లో నిర్వహిస్తున్నామని, ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ కోరారు. డైరెక్టరు కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ కెప్టెన్ డాక్టర్ సత్యప్రసాద్ వర్చ్యువల్ గా విజయవాడ నుండి పాల్గొన్నారు. శిక్షణ ప్రారంభం అనంతరం, ఉమ్మడి అనంతపురం జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి. తిమ్మప్ప మాట్లాడుతూ మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల పెన్షన్ సమస్యల పరిష్కారానికి స్పర్శ్ కామన్ సర్వీస్ సెంటర్ల నిర్వాహకులు సహానుభూతితో పని చేయాలని సూచించారు. రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకట్ రెడ్డి ఎంతో శ్రద్ధ తీసుకుని ఏర్పాటు చేసిన స్పర్శ్ శిక్షణ కార్యక్రమంలో అన్ని అంశాలపై శ్రద్ధతో అవగాహన పొందాలని, శిక్షణ అనంతరం వారి వారి జిల్లాల్లో మాజీ సైనికులకున్న స్పర్శ్ పెన్షన్ వెబ్ యాప్ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కారం చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బాపట్ల జిల్లా నుండి వచ్చిన ట్రైనర్ రెడ్డి శ్రీనివాస వరప్రసాద్, లక్ష్మణ రావు, రాయల సీమ జిల్లాల స్పర్శ్ కామన్ సర్వీస్ సెంటర్స్ నిర్వాహకులు, జిల్లా సైనిక్ సంక్షేమ కార్యాలయ సిబ్బంది గిరీష్, బాబా ఫక్రుద్దీన్, అమర్ లాల్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# కృషి పట్టుదల క్రమశిక్షణతో రాణించాలి









- అమ్మాయిలు అబ్బాయిలకు ధీటుగా చదువుకోవాలి
- విద్యార్థులు సెల్ ఫోన్ లకు దూరంగా ఉండాలి
- షైనింగ్ స్టార్స్ - 2025 కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత
- ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకోండి.. జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 9:** విద్యార్థులు రాణించాలంటేకృషి పట్టుదల క్రమశిక్షణతో ఎంతో అవసరమని విద్యార్థులకు చదువుతో పాటు క్రమ శిక్షణ ఎంతో అవసరమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురం నగరంలోని జిఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన షైనింగ్ స్టార్స్ - 2025 కార్యక్రమంలో ఆమె జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు మెడల్, సర్టిఫికెట్, 20 వేల రూపాయల చొప్పున చెక్కులను అందజేశారు. షైనింగ్ స్టార్స్ కింద 184 మంది 10వ తరగతి విద్యార్థులకు, 35 మంది ఇంటర్ విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కొక్కరికి ఒక మెడల్, సర్టిఫికెట్, 20 వేల రూపాయల చొప్పున చెక్ లను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే అందజేసి వారిని సన్మానించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులతో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే గ్రూప్ ఫోటో దిగారు. తదనంతరం విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ భోజనం చేశారు. ఈ సందర్భంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ షైనింగ్ స్టార్స్ కార్యక్రమం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారని, ఇందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇంతకుముందు ఎప్పుడూ లేనివిధంగా పదవ తరగతి, ఇంటర్ లో మంచి మార్కులు వచ్చిన వారిని గుర్తించి షైనింగ్ స్టార్స్ కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కొంతమంది పిల్లలు తమ తండ్రులు చనిపోయినా తమ మేనమామ, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో చదువుకుంటున్నామని తెలపడం పట్ల చాలా బాధ కలుగుతోందని, తమ పిల్లలు కూడా వాళ్ల నాన్న చనిపోయినా కూడా అత్తమామల వల్ల డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యారని, తండ్రి చనిపోతే చదవడం చాలా కష్టమన్నారు. విద్యార్థులు వెనుకడుగు వేయకుండా బాగా చదువుకుని పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. విద్యార్థులు ఎవరూ సెల్ ఫోన్ లను వాడరాదని, అమ్మాయిలు అబ్బాయిలకు ధీటుగా చదువుకొని ముందుకు పోవాలన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

మరోవైపు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే ఇంటర్మీడియట్ కళాశాలలు ఈనెల 2వ తేదీ మొదలు కాగా, పాఠశాలలు ఈనెల 12వ తేదీన మొదలవుతున్న ముందు షైనింగ్ స్టార్స్ కింద ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అందరినీ కూడా అధికారికంగా జిల్లా స్థాయిలో ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సన్మానించడం జరుగుతోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచన ప్రకారం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లాలో ఉన్న ఇతర పిల్లలకు స్ఫూర్తిదాయకంగా ఉండాలన్నారు. ఇతర విద్యార్థులలో కూడా చదువు పట్ల ఆసక్తిని పెంచాలన్నారు. జిల్లాలో చాలామంది పిల్లలు పెద్దపెద్ద సాధనలు చేశారని, స్టేట్ టాపర్స్ ఉన్నారని, ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో జరిగే పరీక్షలలో కూడా జిల్లా నుంచి 4, 5వ ర్యాంకులను తీసుకురావడం జరిగిందని, ఇందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న పథకాలను ఉపయోగించుకున్నారని, తల్లిదండ్రులు లేకుండా ఎన్నో కష్టాలు ఎదుర్కొని సాధనలో చేయాలని పలువురు దృక్పథంతో విద్యార్థులు ఉన్నారని, పరీక్షలలో మంచి మార్కులను తెచ్చుకొని షైనింగ్ స్టార్స్ గా నిలిచారన్నారు. ఇంతవరకు చేసిన దానికి ఈరోజు సన్మానిస్తుంటే, రాబోయే రోజుల్లో మీరు ఏం చేస్తారు అనేది కూడా ముఖ్యమని, విద్యార్థులు అంతా వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు చెప్పారని, తల్లిదండ్రులు కూడా మీ పిల్లలు భవిష్యత్తులో ఏం కావాలి అనుకుంటున్నారో ఆ కలలు నిజమవుతాయన్నారు.


## సిట్ విచారణకు హాజరైన ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు..



హైదరాబాద్: ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు సిట్ విచారణకు హాజరయ్యారు. ఆయన సుమారు 14 నెలల తర్వాత అమెరికా నుంచి హైదరాబాద్‌కు చేరకున్నారు. పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయన ఏ1గా ఉన్నారు. ప్రభాకర్‌రావు నుంచి కీలక సమాచారం రాబట్టాలని సిట్ అధికారులు భావిస్తున్నారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఇప్పటికే ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు, భుజంగరావు, తిరుపతన్నను సిట్ అధికారులు అరెస్టు చేశారు. వీరు ఇచ్చిన సమాచారం ఆధారంగా ప్రభాకర్‌రావును ప్రశ్నించనున్నారు. ప్రభాకర్‌రావు ఈ కేసు నమోదైన సమయంలోనే అమెరికా వెళ్లారు. ఆ తర్వాత తిరిగి రాకపోవడంతో పోలీసులు ఆయన పాస్‌పోర్టు రద్దు చేయించారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విచారణకు సహకరించేందుకు ఎమర్జెన్సీ ట్రావెల్ డాక్యుమెంట్‌తో ఆదివారం రాత్రి 8.20 గంటల సమయంలో ఎమిరేట్స్ విమానంలో దుబాయ్ మీదుగా హైదరాబాద్ చేరుకున్నారు. ఐజీ స్థాయిలో పదవీ విరమణ చేసిన అధికారి పోలీసు విచారణకు హాజరవుతుండటం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం.

## శ్రీ మదన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలలో కాపు బలిజ సంఘం ఉభయంలో ఆకుపాటి కుటుంబ సభ్యుల మహా అన్నదాన కార్యక్రమం





**కనిగిరి జూన్ 9 అంకుశం న్యూస్:** కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో వెలసి ఉన్న శ్రీ మదన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం కాపు బలిజ సంఘం వారి ఉభయంలో ఉదయం 7 గంటలకు స్వామివారికి విశేష పూజలు, 8.30 నిమిషములకు మోహిని అవతారంలో స్వామివారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా, భేతాళ నృత్య ప్రదర్శన, కనక తప్పెట్లు, నవ్వుల ప్రదర్శన, బాణసంచా, పండు ఈవెంట్స్, డిజె సౌండ్ సిస్టం లతో కాపు బలిజ సంఘం వారు నిర్వహించారు. దేవస్థానములో మధ్యాహ్నం ఆకు పాటి రమణయ్య, శ్రీమతి రాములమ్మ, ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ దంపతులు, ఆకుపాటి డాక్టర్ కిషోర్ దంపతుల సారధ్యంలో 5000 మందికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాపు బలిజ సంఘం నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి హరిబాబు,గుత్తి వెంకటరాజా, వరి కూటి చిరంజీవి, శ్రీరామ్ శ్రీనివాసులు, కొండా నరసింహులు, గద్దె ఏడుకొండలు, బండ్ల నారాయణ, చలివేంద్రం సుబ్బారావు, పాలపర్తి వెంకటేశ్వర్లు, వాయినేని రాఘవ, తదితర కాపు బలిజ సంఘం వారు ఉభయం ఏర్పాట్లను ఆద్యాంతం పర్యవేక్షించారు.

# పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ భూములను గుర్తించండి.

- శ్మశాన వాటికకు తప్పనిసరిగా స్థలాలు సేకరించండి.
- పుట్టపర్తిలో రెవిన్యూ సబ్ డివిజన్ కార్యాలయంలో ఆర్డీఓ ప్రత్యేక ఛాంబర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**అంకుశం న్యూస్ పుట్టపర్తి జూన్ 9:** శ్రీ సత్య సాయి జిల్లాలోనిపుట్టపర్తి నియోజకవర్గం లోని అన్నిమండలాల్లో పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను సత్వర్యమే గుర్తించాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆయా మండల తహసిల్దార్లకు సూచించారు. పుట్టపర్తి లోని రెవెన్యూ సబ్ డివిజన్ కార్యాలయంలో ఆర్డీఓ కు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఛాంబర్ ను సోమవారం ఆర్డీఓ సువర్ణ తో కలసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రారంభించారు. ఆర్డీవో ప్రత్యేక ఛాంబర్ లో నియోజకవర్గానికి చెందిన ఆయా మండలాల తహసిల్దార్లతో ఆర్డిఓ సువర్ణ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి రెవిన్యూ సమస్యలపై ప్రత్యేకంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలని ఎమ్మెల్యే సూచించారు.అంతేకాకుండా అత్యంత ప్రధానంగా స్మశాన వాటికలకు స్థలాలు వెంటనే గుర్తించాలని సూచించారు. రెవిన్యూ పరంగా ప్రజల నుంచి అనేక పిర్యాదులు వస్తున్నాయని వాటికి స్థానికంగా ఆయా మండలాల పరిధిలో తహశీల్దార్లు ,రెవిన్యూ అధికారులు సమన్వయంతో పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం అధికారులు ఎంతో జవాబుదారితనంతో పనిచేయాలన్నారు. ఒక మండల మేజిస్ట్రేట్ గా తహశీల్దార్లు ప్రజలకు న్యాయ నిర్ణేతలుగా పనిచేయాల్సి ఉంటుందనీ , ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోవద్దని హెచ్చరించారు. మనమంతా ప్రజలకు జవాబుదారిగా పనిచేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఆర్డీవో సువర్ణ మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గంలో ప్రజలకు రెవిన్యూ పరంగా ఎలాంటి వివాదాలకు తావులేకుండా పనిచేయాల్సిన బాధ్యత ఆయా మండల తహసిల్దార్ లపై ఉందని సూచించారు. అందరం కలిసికట్టుగా ప్రజల కోసం పనిచేద్దామని ఆర్డిఓ పిలుపునిచ్చారు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పనులను ముందు తీసుకెళ్లే



బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గానికి చెందిన 6 మండలాల తహసీల్దారులు అనంత ఆచారి ,రామ్నాథ్ రెడ్డి రంగనాయకులు, షాబుద్దీన్ , రామాంజనేయులు, కళ్యాణ్ తో పాటు పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు

## యోగా గురించి ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

- : ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలందరూ పాల్గొనాలి
- : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,
- : నగరంలోని 65వ వార్డు సచివాలయం పరిధిలో యోగాంధ్ర ర్యాలీలో పాల్గొని ఇంటింటికి వెళ్లి యోగా గురించి అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్



**అంకుశం న్యూస్ అనంతపురం, జూన్ 09 :** యోగా గురించి ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, పేర్కొన్నారు. సోమవారం అనంతపురం నగరంలోని 65వ వార్డు సచివాలయం పరిధిలో నిర్వహించిన యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి యోగా గురించి జిల్లా కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలందరూ పాల్గొనాలని సూచించారు. ప్రతి ఒక్కరూ యోగా చేయాలన్నారు. యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, యోగాంధ్ర కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామస్థాయిలో, వార్డు స్థాయిలో, హాబిటేషన్ల స్థాయిలో, అన్ని నివాస ప్రాంతాలలో ర్యాలీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రతి సచివాలయ స్థాయిలో సచివాలయ ఉద్యోగులు ఆ సచివాలయం పరిధిలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు యోగా గురించి అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీలను నిర్వహించడం జరిగిందని, ప్రతి ఒక్కరూ యోగాని ప్రాక్టీస్ చేయాలని వారికి తెలియజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ డా.పావని, ఎస్ఈ చంద్రశేఖర్, తహసీల్దార్ హరికుమార్, స్థానిక కార్పొరేటర్లు చంద్రమోహన్ రెడ్డి, శేఖర్ బాబు, ఫుడ్ కంట్రోల్ అధికారి, ఆయుష్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విద్యాప్రదాత గొలుగూరి బాపిరాజువర్ధంతి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 09:** కీర్తిశేషులు గొలుగూరి బాపిరాజు 29వ వర్ధంతి సందర్భంగా జిబిఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలోని ఆయన కాంస్య విగ్రహానికి సెక్రెటరీ కరెస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి కొండబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించినారు ఈ సందర్భంగా తేతల ఆదిరెడ్డి మాట్లాడుతూ ఆయన విద్యాసంస్థలు స్థాపించి అనపర్తి ప్రాంత ప్రజానీకానికి విద్య ను అందజేయడంలో ఆయన యొక్క పాత్ర అమోఘమని స్త్రీ విద్య కు ఆనాడే ఆయన పెద్ద పీ ట వేయడం జరిగిందని అనేకమంది ఉద్యోగస్తులు గృహిణులు వ్యాపారస్తులు అక్షరాస్యత గల వ్యక్తులుగా తయారవడం జరిగింది అంతేగాక మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన కోర్సులు ద్వారా విద్య అందించుచు సామాన్య ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్య నందించుచు వాటితో సమానమైన ఫలితాలను పొందుచు ముందు కు కొనసాగడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు బి రత్నారెడ్డి, జి జగన్నాథరెడ్డి, డివిఆర్‌ఏ పాపిరెడ్డి, కె.హరినాథ్ రెడ్డి మల్లిడిఉమా వెంకటరెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ పి అబ్బాయి రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి ఆర్ ఎల్ స్వామి స్కూల్స్ డీన్ జి హరిప్రసాద్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎంవి వి రామారెడ్డి, నర్సింగ్ డైరెక్టర్ ఎస్ వి వి సత్యనారాయణ రెడ్డి, జిబిఆర్ లెర్నింగ్ స్కూల్ ప్రిన్సిపల్ పి భారతి జిబిఆర్ స్కూల్స్ హెచ్ఎమ్స్ రామారావు కామాక్షి, భువనేశ్వరి, అధ్యాపక బృందం అధ్యాపకేతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన సహపంక్తి భోజనం పాల్గొన్నారు.

## తన్మయి కుటుంబానికి ఎమ్మెల్యే దగ్గుపాటి ఆర్థిక సాయం



- జిల్లా ఎస్పీ తో పాటు బాధిత కుటుంబంతో ఫోన్లో మాట్లాడిన ఎమ్మెల్యే దగ్గుపాటి
- నిందితులకు కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు

**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 9:** అనంతపురం నగరంలో కీచకులు చేతుల్లో దారుణ హత్యకు గురైన ఇంటర్ విద్యార్థిని తన్మయి కుటుంబానికి అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆర్థిక సాయం చేశారు. ఈ దారుణ సంఘటన తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే దగ్గుపాటి జిల్లా ఎస్పీతో ఫోన్ లో మాట్లాడారు. దర్యాప్తు వేగవంతం చేసి నిందితుల్ని కఠినంగా శిక్షించేలా చూడాలని కోరారు. ఈ విషయంలో ఎలాంటి రాజీ వద్దని ఆయన సూచించారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి సూచన మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళా విభాగం నాయకులు, ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తన్మయి ఇంటికి వెళ్లారు. అక్కడ వారి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే దగ్గుపాటి కూడా తన్మయి తల్లిదండ్రులతో ఫోన్లో మాట్లాడారు. జరిగిన సంఘటన చాలా బాధాకరమని ఖచ్చితంగా ప్రభుత్వం మీకు అండగా ఉంటుందన్నారు. మీకు న్యాయం చేసే విధంగా నిందితులను కఠినంగా శిక్షిస్తుందని భరోసా ఇచ్చారు. అలాగే మహిళా నేతల ద్వారా లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా టిడిపి మహిళా నేతలు మాట్లాడుతూ. ఒక ఇంటర్ విద్యార్థినిని ఇంత దారుణంగా చంపడం చాలా బాధాకరమని.. సమాజంలో జరుగుతున్న ఇలాంటి సంఘటనల నేపథ్యంలో విద్యార్థినిల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉందని.. నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వం కూడా వారికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయరాం నాయుడు, సర్పంచ్ ఉదయ్, టిడిపి యువనాయకులు సుందర్, బోయపాటి అశోక్, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంఘ తేజస్విని, తెలుగు మహిళలు మహేశ్వరి, కంతాదేవి, ఫరీదా, వరాలమ్మ, అలివేలమ్మ, అయేషా, మాధవి తదితరులు పాల్గొన్నారు.